క్లుప్తంగా

ఇళ్ల స్థలాలివ్వాలి



వినతిపత్రం ఇస్తున్న చిన్నస్వామి

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో నివసిస్తున్న నిరుపేదలు మాస్టి కులస్తులకు నివేశన స్థలాలివ్వాలని మాస్టి కుల సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దంతెనపెల్లి చిన్నస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ జగదీశ్వర్‌రావుకు వినతిపత్రం అందించారు. మాస్టి కుల సంఘం నాయకులు ధర్మయ్య, గోపి, రాజేందర్, సారయ్య, రాజశేఖర్, రాజన్న, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

గోదావరిఖని: తెలంగాణ రక్షణ సమితి డెమోక్రటిక్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి శంకర్‌గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వాసంపెల్లి ఆనంద్‌బాబుతో కలిసి మాట్లాడారు. టీఆర్‌ఎస్‌డీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలిగా తోడేటి స్వరూపను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. నాయకులు ఈదునూరి నర్సింగ్, ఇనుముల సంతోష్, కొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పైపులైన్ పనులు



పనులు పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని తబితా ఆశ్రమం, భరత్‌నగర్, ఎస్టీ కాలనీలకు తాగునీటి సరఫరా నిమిత్తం పైపులైన్ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే సదరు కాలనీల ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న క్రమంలో.. ప్రస్తుత పనులు త్వరితగతిన పూర్తి చేసి తాగునీటినందించాలని కోరుతున్నారు. పనుల పురోగతి, నాణ్యత తదితర అంశాలపై మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ క్షేత్ర పరిశీలన చేసి సంబంధిత అధికారులతో చర్చించారు.

పేదింటి యువతి పెళ్లికి చేయూత



వివాహ కానుకలు అందిస్తున్న శ్రీసీతారామ సేవాసమితి సభ్యులు

జ్యోతినగర్: పేదింటి యువతి పెళ్లికి శ్రీసీతారామ సేవాసమితి సభ్యులు అండగా నిలిచారు. దాతల సహకారంతో రూ.40వేల విలువైన కానుకలను అందజేసి పేద తల్లిదండ్రులకు భరోసా కల్పించి స్ఫూర్తిగా నిలిచారు. రామగుండం ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన తాళ్లపల్లి జోగయ్య–జయ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. కూలి పనులు చేస్తూ పిల్లలను చదివించారు. పెద్దమ్మాయి కరుణ ఇంటర్ పూర్తి చేసింది. ఈనెల 12న యువతి కరుణ వివాహం నిశ్చయమైంది. హైదరాబాద్‌కు చెందిన యువకుడు ఆ యువతిని ఎలాంటి కట్నకానుకలు లేకుండానే పెళ్లి చేసుకోవడానికి ముందుకొచ్చాడు. పేదింటి దీనస్థితిపై శ్రీసీతారామ సేవాసమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ స్పందించారు. దాతల సాయం కోరారు. మహిళ కిట్టి సభ్యులు రూ.20వేలు అందించగా.. పట్టువస్త్రాలు, వట సామగ్రి కొనుగోలు చేసి అందజేశారు. పలువురు దాతలు ముందుకు రావడంతో.. సోమవారం మంచం, బీరువా, డ్రెస్సింగ్ టేబుల్, ఇతరత్రా సామగ్రిని కొనుగోలు చేసి అందించారు.

బాధితుడికి చేయూత



కాల్వశ్రీరాంపూర్: చిన్నరాతుపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు బందెల రాజశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కుడి కాలు కోల్పోయాడు. జిల్లా అధికారుల సంఘం నేతృత్వంలో ఏడీఏ ఆదిరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి పడిగల ప్రవీణ్‌రెడ్డి సోమవారం రాజశేఖర్‌కు రూ.50వేలు నగదు అందజేశారు.

చదువు చెప్పిన బడి సేవలో..



రంగులతో ముస్తాబైన కొలనూర్ హైస్కూల్



విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేసిన పూర్వ విద్యార్థులు

- కొలనూర్ పాఠశాలలో రూ.20లక్షలతో అభివృద్ధి పనులు
- ఆదర్శంగా నిలుస్తున్న పూర్వ విద్యార్థులు

ఓదెల: పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలతో ఒకటవుతుంటారు. ఒకరినొకరు పలకరించుకుంటారు. ఆటపాటలతో సందడి చేస్తుంటారు. అయితే కొలనూర్ జిల్లాపరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు మాత్రం పాఠశాలకు తమవంతు సహకారమందించాలని తలచారు. అనుకున్నదే తడవుగా కార్యాచరణకు దిగారు. చిన్నప్పుడు చదువుకున్న పాఠశాల అభివృద్ధికి రూ.20లక్షలు విరాళంగా సేకరించారు. 300 మంది పూర్వ విద్యార్థులు మాఊరు మాబడి వేదిక కింద అభివృద్ధి పనులను చేపట్టారు. 1984 నుంచి 2023 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు సంకల్పంతో ముందడుగు వేశారు. హైస్కూలును రంగులతో అందంగా అలంకరించారు. ప్రాథమిక పాఠశాల ముందు విద్యార్థుల సౌకర్యం కోసం రేకుల షెడ్డును నిర్మించారు. విద్యార్థులకు సరిపడేలా అదనపు గదులను నిర్మించారు. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాల పరిశుభ్రతకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. పాఠశాలలో అన్ని తరగతుల విద్యార్థులకు యూనిఫాంలు, స్పోర్ట్స్ డ్రెస్సులతోపాటు కరోనా సమయంలో మాస్కులను ఉచితంగా అందజేశారు. పదోతరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేకంగా ట్యూటర్లను నియమించడంతోపాటు ఉదయం పూట టిఫిన్ ఏర్పాటు చేశారు. పదోతరగతిలో ఏ–గ్రేడు మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులు రాణించేందుకు క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. కంప్యూటర్లను కొనుగోలు చేసి పాఠశాలలో ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల మైదాన స్థలం అన్యాక్రాంతం కాకుండా గోడ నిర్మాణానికి తీర్మానం చేశారు.

ఆనందంగా ఉంది



కొలనూర్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేస్తున్న పూర్వ విద్యార్థుల ఔదార్యాన్ని చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు, ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలి. ప్రస్తుతం పాఠశాల కార్పొరేట్‌కు దీటుగా నడుస్తోంది. విద్యార్థులకు అండగా నిలుస్తున్నాం.

– పూసాల చంద్రమోహన్, పూర్వ విద్యార్థి

సద్వినియోగం చేసుకోవాలి



చదువుతో కుటుంబ ఆర్థిక, సామాజిక భద్రత పెరుగుతుంది. పూర్వ విద్యార్థుల చేయూత వారసులు, భావితరానికి ఒక మెసేజ్‌గా పని చేస్తుంది. విద్యార్థులు పాఠశాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి. సమాజంలో ఇలాంటి కార్యక్రమాలతో గ్రామాల్లో పురోగతి కనిపిస్తుంది.

– జీగురు అయిలయ్య, పూర్వ విద్యార్థి

భాగస్వామ్యం కావాలి



కొలనూర్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. పాఠశాల అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి. ప్రస్తుతం చేపడతున్న అభివృద్ధి పనులు కార్పొరేట్‌కు దీటుగా జరుగుతున్నాయి.

– దేవరకొండ సత్యనారాయణ, పూర్వ విద్యార్థి

మహిళా లోకానికి ఆదర్శం సావిత్రీబాయి పూలే

మంథని: మహిళలకు అక్షర జ్ఞానం నేర్పిన సావిత్రీబాయి పూలే మహిళాలోకానికి ఆదర్శమనే విషయాన్ని ప్రతీ ఒక్కరు గుర్తించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం మంథనిలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏగోళపు శంకర్‌గౌడ్, ఆరెపల్లి కుమార్, ఎక్కేటి అనంతరెడ్డి, వంశీ, సమ్మయ్య తదితరులున్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలో సోమవారం ఈవీఎస్ ఎన్జీవోఎస్ సంస్థ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. తెలంగాణ చౌరస్తాలో సంస్థ చైర్మన్ మహేశ్ నాయకులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాజిరెడ్డి, అశోక్, వెంకటేశ్, సతీశ్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న పుట్ట మధు

కమాన్‌పూర్: మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. నల్లవెల్లి శంకర్, మచ్చగిరి రాము, బొమ్మగాని అనిల్, గుర్రం లక్ష్మిమల్లు, తొట రాజ్‌కుమార్, అంబటి కనకయ్య, నీలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆధ్యాత్మికం

ముగిసిన జాతర



అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామ శివారులో రెండు రోజులుగా కొనసాగుతున్న జాతర సోమవారంతో ముగిసింది. రెండోరోజు వేకువజామున భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి కొమురన్న–మల్లన్న వెళ్లొస్తామంటూ తమకు మొక్కులు అప్పగించారు. జాతర కార్యనిర్వాహక ప్రతినిధి గోపు అయిలయ్యయాదవ్ సారథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ముర్మూర్ గ్రామ శివారులో శ్రీమల్లికార్జున కల్యాణ మహోత్సవం(గోపు కొమురన్న జాతర) వేడుకలకు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కార్మిక సంఘం ప్రతినిధి కౌశిక హరితోపాటు మండల మాజీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో పాలక మండలి సభ్యులతో పూజారులు ధ్వజారోహణం నిర్వహించారు. సోమవారం ఆరాధన పుణ్యాహవచనం, అంకురార్పణం, గ్రహణం, గరుడబలి, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ జరిపారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఎదురుకోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పల్ల మురళీధర్, శరత్, పూజారి శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

నేడు కల్యాణోత్సవం

మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి సంతాన వేణుగోపాలస్వామి తిరుక్కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మురళీధర్ తెలిపారు.

త్వరలో పెద్దపల్లిలో విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం



రాజనందచారిని సన్మానిస్తున్న నాయకులు

ఓదెల: పెద్దపల్లిలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ధర్మపీఠాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కట్ట రాజనందచారి అన్నారు. సోమవారం ఓదెలలో జిల్లా కోశాధికారి నాగవెల్లి శ్రీమన్నారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. రాజనందచారిని ధర్మపీఠం సభాపతి గౌరిశంకర్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి శేల్లోజు కృష్ణమారి, పద్మశ్రీ అవార్డు గ్రహీత వెలు ఆనందచార్యులు సన్మానించారు. జిల్లా కార్యదర్శి మడుపు అంజయ్య, నాయకులు రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుందనపల్లిలో ఎల్లమ్మ బోనాలు



మాజీ ఎమ్మెల్యేకు తిలకం దిద్దుతున్న భక్తురాలు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ తల్లి బోనాల జాతరకు సోమవారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హాజరయ్యారు. గౌడ సంఘం ప్రతినిధులు సాదరంగా ఆహ్వానించారు.

కల్యాణం.. కమనీయం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు జగన్నాథాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం సహస్ర నామార్చన, ధ్వజారోహణ నిర్వహించారు. సాయంత్రం స్వామివారి కల్యాణం జరిపించారు.

నృసింహుడి పల్లకి సేవ



కోలాటమాడుతున్న మహిళలు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి పల్లకి సేవను కన్నుల పండువగా నిర్వహించారు. కోలాట మహిళా బృందాలతో గ్రామంలోని పురవీధుల గుండా స్వామివారి ఉత్సవ మూర్తులతో శోభాయాత్ర చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

జూలపల్లి: తరతరాలుగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శ్రీశ్రీ కొత్తకోట శివానంద స్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో గోశాల నిర్మాణానికి భూమిపూజ చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆధునికత పేరుతో విదేశీ మోజులో పడి యువత సంప్రదాయాలను మరిచిపోతున్నారని, ఆత్మీయతకు, అనుబంధాలకు సంస్కృతి, సంప్రదాయాలు తోడ్పడతాయని అన్నారు. రాజేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ దాత నల్ల మనోహర్‌రెడ్డి, నాయకులు పొట్యాల మల్లేశం, కొప్పుల మహేశ్, నోముల గోపాల్‌రెడ్డి, పాటకుల అనిల్, వజ్రారెడ్డి, వెంకటరమణ, ఆలయ పూజారులు ఉద్దండ రాజన్న, నవీన్, భక్తులున్నారు.

పోచమ్మ ఆలయం పునర్నిర్మాణం



పనులు ప్రారంభించిన గ్రామస్తులు

ఓదెల: ఓదెల గ్రామంలో పోచమ్మ దేవాలయం పునర్నిర్మాణం పనులను గ్రామ పుర ప్రముఖులు సోమవారం ప్రారంభించారు. గ్రామస్తులకు ఆరాధ్య దేవమైన పోచమ్మ దేవాలయాన్ని మోడల్‌గా నిర్మించారు. పోచమ్మ దేవాలయం స్లాబ్ వేయటంతోపాటు భక్తుల సౌకర్యాల కోసం వరండాను ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, మాజీ ఎంపీటీసీ బొడకుంట చిన్నస్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చీకట్ల మొండయ్య, అల్లం సతీశ్, పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకుడు నాగవెల్లి శ్రీమన్నారాయణ, పెరక సంఘం నాయకుడు గోపతి ఎల్లయ్య పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ధర్మారం: లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని తహసీల్దార్ వకీల్, ఎంపీడీవో ప్రేమ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సోమవారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్‌శెట్టి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని వైద్యాధికారి అనుదీప్‌తో కలిసి ప్రారంభించారు. 155 మందికి కంటి పరీక్షలు చేయగా.. 47 మందిని రేకుర్తి కంటి ఆసుపత్రికి శస్త్ర చికిత్స కోసం పంపారు. క్లబ్ అధ్యక్షుడు రవీందర్‌శెట్టి, రీజనల్ చైర్మన్ రాజేందర్, జోన్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ ఎల్లారెడ్డి, రీజనల్ కార్యదర్శి మునిందర్‌రెడ్డి, క్లబ్ కార్యదర్శి ముజాహిద్, వైస్ ప్రెసిడెంట్ మల్లేశం పాల్గొన్నారు.



సుల్తానాబాద్: పట్టణం మీదుగా పెద్దపల్లికి లారీల్లో రాత్రి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. సోమవారం రాత్రి పలు ప్రాంతాల నుంచి పట్టణంలోని తహసీల్ కార్యాలయం మీదుగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకే అనుమతి పొందిన ట్రాక్టర్ల ద్వారానే మట్టిని సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించిన విషయం తెలిసిందే. అయినా కాంట్రాక్టర్లు ఆ నిబంధనలు అమలు చేయకుండా మట్టి సరఫరా చేస్తున్నా స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
తహసీల్దార్, సెల్ నంబర్: 7995070672

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

ఫైల్‌లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని అధికారులు, ఉద్యోగులకు ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్‌పై సోమవారం శిక్షణ ఇచ్చారు. కాగితరహిత, సమయాభావం కలగకుండా సంస్థకు సంబంధించిన అనుమతులు, లావాదేవీలు, పేపర్ లెస్‌గా శాప్‌లోనే ముఖ్య అధికారుల సంతకాలు, కార్పొరేట్ స్థాయి అధికారులు అనుమతులను అందించే ఫైల్ మూమెంట్ విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇప్పటివరకు సింగరేణివ్యాప్తంగా ఉత్తర, ప్రత్యుత్తరాలు, సర్క్యులర్లు, కాగితాలపై జరుగుతున్నాయని, ఇకపై అన్ని రకాల ఉత్తర, ప్రత్యుత్తరాలు సాప్ ద్వారా మాత్రమే జరగడానికి ఫైల్‌లైఫ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అనే ప్రోగ్రాం తయారు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ వల్ల సమాచారం మొత్తం ఆన్‌లైన్‌లో భద్రంగా ఉంటుందని, నూతన విధానాన్నే కొనసాగించాలని ఐటీ డీజీఎం హరప్రసాద్ సూచించారు.

కార్మికులకు ద్రోహం చేసిన సంఘాలు

గోదావరిఖని: బొగ్గు బ్లాకుల కోసం వేలం పాటలో పాల్గొనాలని చెప్పి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికులకు తీరని ద్రోహం చేశాయని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు రియాజ్‌అహ్మద్, టి.శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం హెచ్‌ఎంఎస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ విషయంలో తాము వెనక్కి తగ్గేది లేదని, పోరాటానికి ఎంత దూరమైన వెళ్తామన్నారు. సింగరేణి సొంత ఖర్చులతో ఎక్స్‌ప్లోరేషన్ విభాగం ద్వారా కొత్త బొగ్గు బ్లాకులను గుర్తించిందని అన్నారు. నాయకులు కామెర గట్టయ్య, జి.రాములు, ఏడుకొండలు, ఐ.కృష్ణ, జక్కుల నారాయణ, ఇ.నరేశ్, జైపాల్‌సింగ్, ఎస్.రాజన్న, శేఖర్, రాయపోషం తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

రామగిరి: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమితో కుంగిపోకుండా గెలుపు దిశగా ప్రయత్నాలు చేసినప్పుడే ఉన్నతస్థాయికి చేరుతారని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు అన్నారు. సోమవారం కళాశాల ప్రాంగాణంలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రీడాప్రాంగాణంలో బీజోన్‌స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన మంథని జేఎన్టీయూ కళాశాల జట్టుకు బహుమతి ప్రదానం చేశారు. ఫిజికల్ డైరెక్టర్ పింగిలి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ కోల శ్రీనివాస్, ఏపీఏ అసిస్టెంట్ మేనేజర్ శ్రావణ్ కుమార్, పరిపాలనాధికారి సుమన్, పీడీ సునీల్ పాల్గొన్నారు.

నగదు లేదా.. అయితే ఫోన్‌పే చేయండి

కాల్వశ్రీరాంపూర్: జాజిరి జాజిరి జాజిరి జజ్జ అంటూ బాలురు పేటీఎం స్కానర్‌తో ఇంటింటికి వెళ్తున్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో సోమవారం జాజిరి ఆడుతూ గ్రామస్తులను ఆశ్చర్యపరిచారు. నగదు లేదు, చిల్లర లేదు అనకండి.. మీకు తోచినంత పేటీఎం కొట్టండి, ఫోన్‌పే చేయండంటూ ఆడారు.



గ్రూప్స్ ఫలితాలు విడుదల చేయొద్దు

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3 పరీక్ష ఫలితాలను విడుదల చేయొద్దని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి రుద్రారపు రాంచందర్, అంబాల రాజేందర్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం నుంచి డప్పు కొడుతూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా బయలుదేరి తహసీల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వర్గీకరణ జరిగిన తర్వాతే గ్రూప్స్ ఉద్యోగాలివ్వాలన్నారు. ఎమ్మార్పీఎస్ మండలం అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు కనకం శంకర్, ఉపాధ్యక్షుడు అడ్లూరి గంగారాం, మాజీ సర్పంచ్ క్యాదాశి చంద్రమౌళి, మాజీ ఎంపీటీసీ సంకెనపల్లి లక్ష్మణ్, నాయకులు మాణిక్, నాంపల్లి, ఉప్పల్, రాములు, లింగయ్య, రాజేశం తదితరులు పాల్గొన్నారు.



డప్పు కొడుతూ నిరసన తెలుపుతున్న రాంచందర్ తదితరులు

ఎన్టీపీసీ అధికారికి నివాళి

జ్యోతినగర్: జార్ఖండ్ రాష్ట్రం హజారి బాగ్‌లోని కట్కుడాంగ్ పోలీస్ స్టేషన్ పరిధి కెరందారి కోల్ మైనింగ్‌లో డీజీఎంగా విధులు నిర్వహిస్తున్న కుమార్ గౌరవ్ హత్యకు నిరసనగా ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు అధికారులు పర్మినెంట్ టౌన్‌షిప్‌లో కొవ్వొత్తులను వెలిగించి నివాళి అర్పించారు. పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని ప్రధాన దుకాణ సముదాయం వద్ద జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత పాల్గొని మాట్లాడారు. ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్, విశ్వనాథ్‌శర్మ, అభిషేక్, మాజీ కార్పొరేటర్ కౌలి పాక సుజాత, ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్, బీఎంఎస్ సాగర్ రాజు, ఎన్టీపీసీ సంస్థ అధికారులు, ఉద్యోగులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఈడీ చందన్‌కుమార్ సామంత తదితరులు

కుంగ్‌ఫూ, కరాటేలో ప్రతిభ

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయ కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్, మాటేటి కృష్ణప్రియ అభినందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా: 9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : ప్రశాంత్ - 9652397696
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899